భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

28, అక్టోబర్ 2026, బుధవారం భారత్ సమాచార్

# రేషన్ కార్డుదారులకు గుడ్‌న్యూస్




**భారత్ సమాచార్, వెబ్ డెస్క్ :** తెలంగాణలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరట కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదనను పరిశీలిస్తోంది. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో పాటు మరికొన్ని నిత్యావసర సరుకులను సబ్సిడీ ధరలకు అందించే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ జాబితాలో కందిపప్పు, గోధుమపిండి, పామాయిల్, చక్కెర, చింతపండు, కారం పొడి వంటి వస్తువులు ఉన్నాయి. అయితే, వీటి పంపిణీపై ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఏయే సరుకులను పంపిణీ చేయాలి, ఒక్కో లబ్ధిదారుడికి ఎంత పరిమాణంలో అందించాలి, వాటిని ఎక్కడి నుంచి సేకరించాలి అనే అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. వివిధ పంపిణీ విధానాలకు అయ్యే ఖర్చును, ప్రభుత్వంపై పడే ఆర్థిక భారాన్ని కూడా అంచనా వేస్తున్నారు. సరుకుల రవాణా, నిల్వలు, రేషన్ దుకాణాల ద్వారా పంపిణీకి అవసరమైన ఏర్పాట్లపైనా దృష్టి సారించారు.

ప్రస్తుతం తెలంగాణలో సుమారు 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల పరిధిలో 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తోంది. మరోవైపు, ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, పంట నష్టాలు సంభవించే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఆహార ధాన్యాల నిల్వలను పటిష్ఠం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అక్టోబర్ 16 నాటి అంచనాల ప్రకారం గోదాముల్లో 9.64 లక్షల టన్నుల బియ్యం ఉండగా, మరో 18.39 లక్షల టన్నులు వివిధ మార్గాల్లో అందుబాటులోకి రావాల్సి ఉంది.

అదనపు నిత్యావసరాల పంపిణీ అమల్లోకి వస్తే కుటుంబాల నెలవారీ ఖర్చులు కొంతవరకు తగ్గే అవకాశం ఉంది. అయితే, సరుకుల పరిమాణం, ధరలు, పంపిణీ కాలపరిమితి వంటి వివరాలు ఇంకా ఖరారు కాలేదు. అధికారులు సమర్పించే నివేదికను పరిశీలించిన తర్వాత రాష్ట్ర మంత్రివర్గం తుది నిర్ణయం తీసుకోనుంది. ఆర్థిక, సరఫరా పరమైన అంశాలు అనుకూలిస్తే వచ్చే సంక్రాంతి నాటికి ఈ ప్రతిపాదన అమలయ్యే అవకాశముందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.